క్లుప్తంగా

జోనల్ స్థాయిలో గొల్లపల్లి విద్యార్థి ప్రతిభ

యాదమరి(పూతలపట్టు): జోనల్ స్థాయి పోటీల్లో కె.గొల్లపల్లి విద్యార్థి సత్తా చాటాడు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా స్థాయిలో నిర్వహించిన దేశ భక్తి గేయాల పోటీలో కె.గొల్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి కె.ధనుష్ గెలుపొంది, జోనల్ స్థాయి(ఉమ్మడి నాలుగు జిల్లాలు)లోనూ మొదటి విజేతగా నిలిచారని, ఆ హైస్కూల్ ప్లస్ ప్రిన్సిపల్ లలిత ఓ ప్రకటనలో తెలిపారు. విజేత ధనుష్‌ను బుధవారం పాఠశాల తరఫున అభినందించారు. అనంతరం ఎంఈఓ రుక్మిణి, ఉపాధ్యాయుల బృందం అభినందించారు.

వృద్ధాశ్రమంలో స్వెట్టర్ల పంపిణీ



వృద్ధులకు స్వెట్టర్లు అందజేస్తున్న దాతలు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని గంగనపల్లె కూడలిలో ఉన్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దాతలు స్వెట్టర్లను పంపిణీ చేశారు. కట్టమంచికి చెందిన రవిరెడ్డి, పునిత కలిసి పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరాశ్రయుల కేంద్రంలో బుధవారం వృద్ధులకు స్వెట్టర్లు అందచేశారు. సంస్థ నిర్వాహకులు జోసెఫ్‌రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల కోసమే ఫ్యామిలీ డాక్టర్



రోగులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్, సిబ్బంది

తవణంపల్లె: పేదలకు మెరుగైన వైద్య సేవలందించడానికే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని మట్టుకూరులో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. డాక్టర్ ప్రజలకు ఆరోగ్య సూత్రాలను వివరించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి లార్వాలను నశింపచేయాలని పేర్కొన్నారు. వర్షాకాలంలో తాగునీరు కాచి చల్లార్చి తాగాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి నమూనా పరీక్షలు తప్పనిసరి

కార్వేటినగరం: పంట సాగుకు మట్టి నమూనా పరీక్షలు తప్పనిసరని మండల వ్యవసాయ అధికారిణి హేమలత అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆళత్తూరు, కత్తెరపల్లి, పొన్నగల్లు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. పంట సాగుకు మట్టి నమూనా పరీక్షలు నిర్వహించి అందుకు అనుగుణమైన పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. పంట సాగులో కలుపు మొక్కల నివారణ మెళకువలను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. అలాగే ప్రతి రైతు పంట ఆధారిత బీమాను సద్వినియోగం చేసుకుని పంట నష్టం వాటిల్లినప్పుడు బీమా ద్వారా లబ్ధి పొందవచ్చని పేర్కొన్నారు. అనంతరం రైతులు తీసుకొచ్చిన మట్టి నమూనాలను పరిశీలించారు.

శిథిలం.. వసతి గృహం



శిథిలావస్థకు చేరిన ఎస్సీ హాస్టల్ భవనం

పుత్తూరు: ఉన్నత చదువులు చదివి.. తమ కుటుంబాలకు అండగా నిలవాలని ఎన్నో ఆశలతో స్వగ్రామాలను వదిలి పట్టణాలకు తరలి వచ్చిన బాలికలకు ఇక్కడి హాస్టళ్లలో సౌకర్యాలు లేక నరకయాతన పడుతున్నారు. తరగతి గదుల్లో పుస్తకాలతో కుస్తీ పట్టిన చిన్నారులు రాత్రులు కంటి నిండా నిద్రించే పరిస్థితి లేదు. ఏ క్షణం ఏ పైకప్పు ఎవరిపైన పడుతుందోనని బాలికలు భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నారు. పుత్తూరు ఎస్సీ బాలికల వసతి గృహంలోని విద్యార్థినుల దయనీయ పరిస్థితికి ఇవి అద్దం పడుతున్నాయి.



దెబ్బతిన్న వరండా పైకప్పు

వరికి వాయుగండం



కోసిన వరి కంకులను తరలిస్తున్న కూలీ



పంటను ఒబ్బిడి చేస్తున్న యంత్రం

బంగారుపాళెం: దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం రైతులను కలవర పెడుతోంది. హఠాత్తుగా మంగళవారం నుంచి వాతావరణం మారిపోవడంతో రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. వాయుగుండం తుపానుగా మారి రెండు రోజుల్లో తీరం దాటే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 250 హెక్టార్లలో వరి సాగు చేశారు. ఇప్పటి వరకు 230 హెక్టార్లలో వరికోతలు పూర్తయ్యాయి. 20 హెక్టార్లలో వరి కోతలు చేయాల్సి ఉంది. కొంత మంది రైతులు వరిపంటను కూలీలు పెట్టి కోసి ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా ఇళ్లకు తరలిస్తున్నారు. వాతావరణం బాగుంటే మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు, రహదారుల పక్కన ఖాళీ ప్రదేశాల్లో ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. ఒక రోజులోనే పొలంలోని పంట ఇళ్లకు చేర్చి, యంత్రాల సాయంతో పంటను ఒబ్బిడి చేసుకునే ఆత్రుతలో ఉన్నారు. వాయుగుండం ప్రభావం వల్ల బుధవారం మబ్బులు కమ్మి ముసురు పట్టడంతో మరి కొందరు రైతులు వరి కోతలు వాయిదా వేసుకున్నారు.



మార్కెట్ యార్డులో ధాన్యాన్ని ఆరబోసిన రైతులు



పొలంలో వరి పంట కోస్తున్న కూలీలు

ఆధునిక పద్ధతులతో వ్యవసాయం లాభసాటి

ఐరాల: రైతులు ఆధునిక పద్ధతులను అనుసరించి లాభసాటి వ్యవసాయం చేయాలని ఏఓ వరలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని పుల్లూరులో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. రైతులు పురుగు మందులు, రసాయనిక ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం చేయాలని చెప్పారు. వర్షాల మూలాన వరి రంగు మారకుండా ఉప్పు నీటిని పంటపై పిచికారీ చేయాలని సూచించారు. తక్కువ ఖర్చులతో అధిక దిగుబడికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.



మాట్లాడుతున్న ఏఓ వరలక్ష్మి

ప్రస్తుతం కంది పంట పూత, పిందె దశలో ఉందన్నారు. పచ్చ పురుగు నివారణకు ఇమోమెక్టిన్ బెంజోయేట్ ఎకరానికి 100 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు.

ప్రతిభ చాటిన మంగళపల్లె విద్యార్థులు

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటినట్లు హెచ్‌ఎం రాజ్యలక్ష్మి బుధవారం తెలిపారు. 75వ భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా వైఎస్సార్ కడప జిల్లాలో విద్యాశాఖ ఆధ్వర్యంలో జోనల్ స్థాయిలో వివిధ రకాల పోటీలను నిర్వహించారన్నారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న హేమ డిబేట్ విభాగంలో, వ్యాసరచన పోటీల్లో హిమశ్రీ మొదటి బహుమతులను సాధించి జిల్లాకు పేరు తీసుకువచ్చారని చెప్పారు. ఆ జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి చేతుల మీదుగా విద్యార్థులు బహుమతులు అందుకున్నారని తెలిపారు. విద్యార్థులకు గణితోపాధ్యాయుడు, అవధాని అరుణశివప్రసాద్ మార్గదర్శకం చేశారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.



కడప డీఈఓ చేతుల మీదుగా బహుమతులను అందుకుంటున్న మంగళపల్లె విద్యార్థులు

గోకులం షెడ్ల మంజూరుపై నిలదీత



పశువైద్యాధికారిని నిలదీస్తున్న సర్పంచ్ వెంకటేష్, వైస్ ఎంపీపీ కోదండన్

పెనుమూరు (కార్వేటినగరం): ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఎంపీపీ మహా సముద్రం హేమలతారెడ్డి కోరారు. బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. అనంతరం గోకులం షెడ్లు స్థానిక ప్రజా ప్రతినిధులకు తెలియకుండా టీడీపీ నేతలు, ఆ పార్టీ సానుభూతిపరులకు అధికారులు మంజూరు చేస్తున్నారని రామకృష్ణాపురం సర్పంచ్ వెంకటేష్, వైస్ ఎంపీపీ కోదండన్ పశువైద్యాధికారి సుబ్రహ్మణ్యంను నిలదీశారు. దీంతో ఎంపీడీఓ నీలకంఠేశ్వర రెడ్డి స్పందిస్తూ.. అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని ఇప్పటి వరకు ఎవరికీ గోకులం షెడ్లు మంజూరు చేయలేదని వివరణ ఇచ్చారు. పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. విద్యుత్ ఏఈ తులసీ ప్రసాద్ మాట్లాడుతూ.. వినియోగదారులు సోలార్ విద్యుత్ కనెక్షన్లు పొందేందుకు పెనుమూరును పైలట్ ప్రాజెక్టు కింద ప్రభుత్వం ఎంపిక చేయడం జరిగిందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు దొరస్వామియాదవ్, తహసీల్దార్ శ్రావణకుమార్, ఏపీఓ గుణశేఖర్, ఎంఈఓలు రాజేంద్రన్, భాస్కర్ నాయుడు, ఈఓపీఆర్డీ ఉమామహేశ్వర్, వ్యవసాయ శాఖ అధికారిణి సుహర్‌లత, వెలుగు ఏపీఎం చిరంజీవి పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బంగారుపాళెం: బాల్య వివాహాలతో అనర్థాలు ఎదుర్కోవాల్సి వస్తుందని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ స్టాఫ్ కో–ఆర్డినేటర్ మురళి అన్నారు. స్థానిక పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం బాల్యవివాహాలు–అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, వివాహ వయసు రాకముందు పెళ్లి చేసుకోవడం వల్ల చిన్న వయసులో గర్భిణులు కావడం, రక్తహీనత కుంటుపడుతుందన్నారు. మాతా, శిశుమరణాలు సంభవిస్తాయన్నారు. 18 ఏళ్లు నిండినవారు, ఆర్థిక, ఆరోగ్య విషయాల్లో అవగాహన వచ్చిన తరువాత వివాహాలు చేసుకోవడం మంచిదన్నారు. చైల్డ్ హెల్ప్ లైన్ సభ్యులు సబిత, ఉమా మాట్లాడుతూ, సమాజంలో బాల్యవివాహాలను అరికట్టడం ప్రతి పౌరుని బాధ్యత అని పేర్కొన్నారు. బాల్యవివాహాలను నియంత్రించేందుకు సంఘటితంగా కృషి చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాల్యవివాహాలపై హెల్ప్‌లైన్ నంబర్ 1098, 112కి సమాచారం అందించాలని కోరారు. పోక్సో చట్టం, బాల్య వివాహాల చట్టం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ గిరిబాబు, అధ్యాపకులు, ఆరోగ్య సిబ్బంది, రియల్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలను తెలుసుకుంటున్న డీఈ ప్రసాద్

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ట్రాన్స్‌కో డీఈలు ప్రసాద్, ఆనంద్ తెలిపారు. స్థానిక అర్బన్ డివిజన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో మాట్లాడారు. కార్యక్రమంలో మొత్తం 3 సమస్యలు వచ్చాయన్నారు. కోర్టులో తీర్పు తమకు అనుకూలంగా వచ్చిందని సర్వీసు ఇవ్వాలని ఓ బాధితుడు తెలిపారు. వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ స్తంభం, లైన్‌లాగాలని, ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని తెలిపారు. పంచాయతీకార్యదర్శి నుంచి సర్వీసు ఇవ్వడానికి ఎన్‌ఓసీ తీసుకురావాలని చెప్పారు. వ్యవసాయ లైన్ లాగడానికి ఉన్న సమస్యను స్థానికంగా పరిష్కారించుకుని తదుపరి కలవాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ సరఫరా సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జేఏఓ గోవిందరాజులు, టెక్నికల్ ఏఈ మాధురి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి



సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

చిత్తూరు అర్బన్: అధికారంలోకి వస్తే అర్హత ఉన్న పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని నమ్మబలికిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా ఎందుకు అడుగులు వేయడంలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజన్ ప్రశ్నించారు. చిత్తూరు నగరంలోని 40వ డివిజన్ సచివాలయం ఎదుట బుధవారం వారు నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు నివాస భవనం కోసం భూమిని ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం.. ఆ మేరకు మాట నిలబెట్టుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా రాజకీయాలకు అతీతంగా పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా ఇళ్లను నిర్మించుకునే యూనిట్ ధరను సైతం రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు దామోదరం పాల్గొన్నారు.

వర్షాకాలం.. వరికోతలు వద్దు



కరపత్రాలు విడుదల చేస్తున్న ఏడీ

పుంగనూరు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు వరి పంటను ఒబ్బిడి చేసే కార్యక్రమం వాయిదా వేసుకోవాలని ఏడీ శివకుమార్ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం చంద్రమాకులపల్లెలో నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల బీమా కార్యక్రమాలపై కరపత్రాలు విడుదల చేసి, రైతులకు అవగాహన కల్పించారు. ఏడీ మాట్లాడుతూ వరి కోతలు ప్రారంభించి ఉంటే తక్షణమే వాటిని షెడ్లలోకి తరలించుకోవాలన్నారు. వర్షానికి వరిపంట మొలకెత్తడంతోపాటు నల్లగా మాడిపోతుందని, దీని కారణంగా గిట్టుబాటు ధర లభించదన్నారు. రైతులు వీటిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఏఓ ఫయాజ్, రైతులు పాల్గొన్నారు.

పెద్ద భవనం.. సదుపాయాలు అధ్వానం



అద్దెకు తెచ్చిన కూలర్



పనిచేయని కొళాయి



అద్దెకు తెచ్చిన ఫ్యాన్ (వృత్తంలో)

- జెడ్పీ సమావేశ మందిరంలో వసతులు కరువు
- ఉక్కపోతతో అల్లాడిపోవాల్సిందే
- అద్దెకు కూలర్లు, లైట్స్, మైక్‌సెట్

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో ముఖ్యమైన సమావేశాలు కలెక్టరేట్ తర్వాత జెడ్పీలో నిర్వహిస్తున్నారు. జిల్లా, ఉమ్మడి జిల్లా స్థాయి సమావేశాలు ఇక్కడ నిర్వహించడం పరిపాటి. కానీ ఇంత పెద్ద భవనంలో ఏసీలు పనిచేయవు. ఫ్యాన్లు లేవు. మైక్ సిస్టం లేదు. సమావేశాలకు హాజరయ్యే వారందరూ కూర్చుంటే లోపల ఉక్కబోతతో అల్లాడిపోవల్సిందే. పాడైన ఏసీ మరమ్మతు చేయక తిప్పలు తప్పడం లేదు. దీంతో పాటు అరకొర వసతులతో నిర్వహణ అధ్వానంగా మారింది.

అన్నీ అద్దె వస్తువులే

ప్రతి మూడు నెలలకోసారి జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ, జనరల్ బాడీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాలకు మాత్రమే మీటింగ్ హాలును సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. అద్దెకు కూలర్లు, లైటింగ్, మైక్‌సెట్ తీసుకొస్తారు. వేలకు వేలు పెట్టి తాత్కాలికంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇతర శాఖల సమావేశాలు అయితే వారే తాగేనీటి క్యాన్లతో సహా అన్ని రకాల వసతులను అద్దెకు తెచ్చుకు పెట్టుకోవాల్సిందే. మొదటి అంతస్తుకు సామగ్రి ఎక్కించాలంటే అగచాట్లు తప్పడం లేదు.

అద్దె వసూళ్లతో పరిష్కారం

జెడ్పీలో సమావేశం ఏర్పాటు చేసుకోవాలంటే అంబేడ్కర్‌భవన్, నాగయ్య కళాక్షేత్రం తరహాలో నిర్వహణ కోసం అద్దెను వసూల్ చేసే పద్ధతి ఉంది. కానీ ఇక్కడ ఆ పద్ధతిని అధికారులు మర్చిపోవడంతో వసతులు కల్పన కష్టంగా మారింది. మందిరానికి అద్దె వసూలు చేసి ఆ డబ్బుతో మరమ్మతు అయిన సెంట్రల్ ఏసీని బాగు చేయవచ్చు. వీటితోపాటు టేబుల్ ఫ్యాన్స్, లైట్స్, మైక్‌సెట్, టాయిలెట్స్ మరమ్మతు పనులకు ఉపయోగించవచ్చు.

ప్రతిపాదనలు పెడతాం



జెడ్పీ సమావేశం మందిరంలో వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం. వీటిపై జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో చర్చించగా ఆయన పలు సూచనలు చేశారు. ఏసీని బాగు చేసి మైక్‌సెట్, లైటింగ్, ఫ్యాన్స్ ఇతర సౌకర్యాల కల్పనకు కృషి చేస్తాం. సమావేశాలకు అద్దె విషయంపై ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

– రవికుమార్‌నాయుడు, సీఈఓ, జెడ్పీ

రోడ్డుపై గొయ్యి.. ఆగిపోయిన బస్సు

యాదమరి(పూతలపట్టు): రోడ్డంతా గుంతలమయంగా మారి, రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని ఎంత మొత్తుకున్నా పాలకులు కానీ, అధికారులకు కానీ చీమ కుట్టినట్లు కూడా లేదు. ఫలితంగా బుధవారం నడి రోడ్డుపై ఉన్న పెద్ద గుంతలో ఆర్టీసీ బస్సు ఇరుక్కుపోయి నిలిచిపోయింది. యాదమరి నుంచి తెల్లరాళ్లపల్లి వరకు రోడ్డు పెద్ద పెద్ద గుంతలతో నిండిపోయింది. ఉదయం 7 గంటలకు ఆర్టీసీ బస్సు వరదరామి నుంచి చిత్తూరుకు బయలుదేరగా మార్గమధ్యలో కాశిరాళ్ల వద్దనున్న పెద్ద గుంతలో ఆగిపోయింది. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా బస్సు ముందుకు కదలలేదు. దీంతో బస్సులోని ప్రయాణికులు, విద్యార్థులు బస్సునుంచి కిందకి దిగేశారు. ఆ తరువాత బస్సు అతి కష్టమ్మీద ముందుకు కదలడంతో ప్రయాణికులు, డ్రైవర్, కండక్టర్ ఊపిరి పీల్చుకున్నారు. ఈ విధంగా రెండు వారాల క్రితం ఓ లారీ గుంతలో దిగి పైకి ఎక్కలేకపోయింది. జేసీబీ సహాయంతో లారీని పైకి లాగారు. అంతవరకు లారీ వెనుక వాహనాలు ఎక్కడిక్కడ భారీగా నిలిచిపోయాయి. ఇలాంటి సంఘటనలు ఎన్ని జరిగితే అధికార యంత్రాంగంలో కదలికలు వస్తాయోనని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



కాశిరాళ్ల రోడ్డు వద్ద గుంతలో ఆగిపోయిన బస్సు